నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ప్రశాంత్‌నగర్ సబ్‌స్టేషన్ టీమ్ టెక్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకటేశ్వర టెంపుల్, స్లాబ్ కంపెనీ లైన్, టైం టెక్ గల్లీ. హెచ్ఎంటీ సబ్‌స్టేషన్ పరిధిలో గణేశ్‌నగర్, హనుమాన్ టెంపుల్, గౌతమ్ కాలేజ్, తెలంగాణ స్పిల్లింగ్ మిల్స్ ఏరియా, ఎస్‌బీఐ, రీడ్డి టవర్స్, పట్వారి ఎన్‌క్లేవ్, స్ఫూర్తినగర్ తదితర ప్రాంతాలు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రశాంత్‌నగర్ సబ్‌స్టేషన్ సోనీ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో ప్రశాంత్‌నగర్, వెంకటేశ్వర ఇండస్ట్రీస్ లైన్, గ్రీన్ వీల్స్ లైన్, హెచ్ఎంటీ సబ్‌స్టేషన్ శ్రీసాయికాలనీ ఫీడర్ పరిధిలో భగత్ సింగ్‌నగర్, గాంధీనగర్, చింతల్, చంద్రానగర్, రంగానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

25న జాబ్‌మేళా

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని కె.ఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో ఈనెల 25న అప్రెంటిషిప్ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్‌మైమూన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023, 2024, 2025 విద్యా సంవత్సరంలో పారామెడికల్, నాన్ పారామెడికల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మల్కాజిగిరి డీఐఈఓ కిషన్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్లతో రావాలని సూచించారు.

శ్రీశైలంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



దుండిగల్: శ్రీశైలం భ్రమరాంబ మల్లిఖార్జున స్వామిని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారిని శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేశారు. కార్పొరేటర్లు కొలుకుల జగన్, జూపల్లి సత్యనారాయణ, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, భౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేయించుకుంటున్న సత్‌జ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ మల్లేశం

కుత్బుల్లాపూర్: రీచ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు థైరాయిడ్, బీపీ చెకప్, ఆర్‌బీఎస్ పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా శ్వాసకోశ, ఎముకలకు సంబంధించి సమస్యలతో బాధపడుతున్న 300 మందిని పరీక్షించి మందులు అందజేశారు. శిబిరంలో లయన్, సత్‌జ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం, వైద్యులు నవనీత, రామకృష్ణారెడ్డి, చంద్రకిరణ్, అక్షయ్, మహేశ్‌తో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



చింతల్: కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలోని దుర్గా మాతా ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా పాల్గొని వ్రతాలు ఆచరించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయగా ఏపీహెచ్‌బీ కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

జనరల్ బాడీ సమావేశం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీ జనరల్ బాడీ సమావేశాన్ని అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈనెల 30 లోగా కాలనీ సంక్షేమ సంఘం సభ్యత్వం తీసుకోవాలని, త్వరలోనే కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఉంటాయని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్. పి.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షపతి నేత,అడహక్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ బ్యానర్ కట్టుకుని వ్యర్థాలు పారబోసేందుకు వచ్చిన ట్రాక్టర్



మారుతీనగర్‌ను ఆనుకుని హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలో వరద నాలా పైపులు పూడుకుపోయిన దృశ్యం



యథేచ్ఛగా డెబ్రిస్ డంపింగ్..!

- ప్రభుత్వ స్థలాలు, ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్న వైనం
- డంపింగ్ మాఫియాకు బస్తీ నాయకుల బాసట
- పూడుకుపోతున్న వరదనీటి నాలాలు



గాంధీనగర్ శ్మశాన వాటికను ఆనుకుని ఖాళీ ప్రదేశంలో డంప్ చేసిన వ్యర్థాలు

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో డెబ్రిస్ మాఫియా రెచ్చిపోతోంది. అధికారుల నిఘా లేకపోవడంతో ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను పారబోస్తోంది. డెబ్రిస్ వ్యర్థాలు సేకరించేందుకు కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లకు సంబంధించి షాపూర్‌నగర్ హెచ్ఎంటీ పైపులైన్ రోడ్డులో జీహెచ్ఎంసీ అధికారులు పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇందులో నిర్మాణ వ్యర్థాలు అందజేసేందుకు టన్నుకు రూ.349 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది ఖర్చుతో కూడుకున్నది కావడంతో చాలామంది డెబ్రిస్ మాఫియాను ఆశ్రయిస్తున్నారు. వారు ట్రాక్టర్‌కు రూ.2 వేలు చొప్పున తీసుకుంటూ చడీ చప్పుడు కాకుండా వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దీంతో జంట సర్కిళ్ల పరిధిలో ఏ ఖాళీ ప్రదేశం చూసినా కాంక్రీట్ వ్యర్థాలతోనే దర్శనమిస్తోంది.

జీహెచ్ఎంసీ బ్యానర్‌తో డంపింగ్

డెబ్రిస్ మాఫియా బరి తెగిస్తోంది. ఆదివారం ఏకంగా ట్రాక్టర్‌కు జీహెచ్ఎంసీ బ్యానర్ ఏర్పాటు చేసి డంపింగ్ చేయడం గమనార్హం. గాంధీనగర్ శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశంలో డెబ్రిస్‌ను డంప్ చేస్తుండగా 'సాక్షి' కెమెరాకు చిక్కింది. సదరు డ్రైవర్‌ను ప్రశ్నించగా గాంధీనగర్‌లోని సీసీ రోడ్ల వ్యర్థాలను బస్తీ నాయకులు ఇక్కడ వేయమన్నారని పేర్కొన్నాడు.

టాస్క్‌ఫోర్స్ చేతివాటం,నాయకుల సహకారం

రోడ్లకిరువైపులా ఖాళీ ప్రదేశాల్లో డెబ్రిస్ డంపింగ్‌ను అడ్డుకునేందుకు జీహెచ్ఎంసీ అధికారులు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినా సిబ్బంది మాత్రం ఎక్కడా కనిపించరు. ఒకవేళ డెబ్రిస్‌ను డంప్ చేస్తున్న ట్రాక్టర్ కంటపడినా వారి నుంచి అందిన కాడికి దండుకుని వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బస్తీవాసులు ఫిర్యాదు చేస్తేనే స్పందించి చలాన్ విధిస్తున్నారు. డంపింగ్ చేస్తున్న వారి నుంచి బస్తీ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. దీంతో వెంకట్రాంరెడ్డినగర్ ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల,గాంధీనగర్ శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశం, ఐడీపీఎల్ ఖాళీ ప్రదేశం, హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశాలు డంపింగ్‌కు ఆవాసాలుగా మారుతున్నాయి.

పూడుకుపోతున్న వరదనీటి నాలాలు

హెచ్ఎంటీ జంగల్, గాంధీనగర్–వెంకట్రామిరెడ్డినగర్ మీదుగా వచ్చే నాలా పైపులైన్లు మూసుకుపోతున్నాయి. ఇటీవల గాంధీనగర్‌లో సీసీ రోడ్డు వేసే క్రమంలో చేపట్టిన తవ్వకాల వ్యర్థాలను సదరు కాంట్రాక్టర్ హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలో డంప్ చేయించాడు. దీంతో వర్షం వచ్చినప్పుడు ఖాళీ ప్రదేశంలో నుంచి వచ్చే వరద నాలాల్లోకి చేరుతోంది. ఇటీవల కొంతమంది స్థానికులు నిర్మాణ వ్యర్థాలను తీసుకువచ్చి నాలా కల్వర్టు వద్ద పోయడంతో పైపులు మూసుకుపోయాయి. భారీ వర్షం కురిస్తే నీరు వెళ్లలేక మారుతీనగర్ గల్లీలను ముంచెత్తే ప్రమాదం ఉందని మారుతీనగర్ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, శానిటేషన్ చొరవ తీసుకుని వ్యర్థాలను తరలించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఎంపీ ఈటల రాజేందర్‌కు సత్కారం



ఎంపీ ఈటల రాజేందర్‌ను గొంగడితో సత్కరిస్తున్న జేకే శేఖర్ యాదవ్



కేశవ్‌యాదవ్ ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట: సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప సభ'కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు యాదవ సంఘం తరఫున జేకే శేఖర్‌యాదవ్ మేకపిల్లని అందించి గొంగడితో సత్కరించారు. కార్యక్రమంలో జగన్ ముదిరాజ్, ఆర్థిక్ యాదవ్, రాజేశ్, ప్రసాద్, రెడ్డప్ప, ఆంజనేయులు, బీరప్ప, శ్రీకాంత్ కుమార్ యాదవ్, మల్లికార్జున కురుమ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సూరారం డివిజన్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో..

కుత్బుల్లాపూర్: సూరారం డివిజన్ అధ్యక్షుడు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్ నుంచి బస్సుల్లో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి, డివిజన్ నాయకులు తిరుపతి, ప్రశాంత్‌రెడ్డి, వెంకటేశ్, సరోజ, సిద్ధార్థ, నరసింహ తరలివెళ్లారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



గాయత్రీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి కోరారు. జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రీనగర్, శ్రీరామ్‌నగర్‌లో నెలకొన్న మంజీరా పైపులైన్ లీకేజీ, రోడ్డు సమస్యలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను స్థానిక కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీవాసులు పాపయ్య దొర, సంజీవ్ రెడ్డి, విద్యాసాగర్, రాజు బన, ఆంజనేయులు, నిఖిల్ రాజ్, గంగేశ్వర్ రావు, కిరణ్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎంసీ బీసీ కోర్ కమిటీ సమావేశం

నిజాంపేట్: ఎన్ఎంసీ బీసీ అధ్యక్షుడు కుమార్ యాదవ్, ఎన్ఎంసీ కాంగ్రెస్ బీసీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ఎన్ఎంసీ బీసీ కోర్ కమిటీ అధ్యక్షుడు లింగాల గంగాధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఐదో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల వారీగా కొత్తగా బాధ్యతలు తీసుకునే వారికి రానున్న ఎన్నికల్లో బీసీల ఐక్యత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బీసీ కోర్ కమిటీ సభ్యులు సాయిరాజ్, నర్సింహా యాదవ్, రమా మాట్లాడుతూ.. గత 70 ఏళ్లుగా బీసీలు అన్ని రకాలుగా నష్టపోయారన్నారు. 60 శాతం జనాభా ఉన్నా రాజకీయాలకు అంటరాని వారీగా ఉంచబడ్డారన్నారు. ప్రస్తుతం వాటన్నింటినీ పక్కనబెట్టి అన్ని రాజకీయ పార్టీల్లోనూ బీసీలు పెద్దన్న పాత్ర వహించి ముందుకు సాగాల్సిన సమయం దగ్గరలోనే ఉందన్నారు.

13వ డివిజన్‌కు సంబంధించిన కమిటీ సభ్యులు,

ఉపాధ్యక్షుడిగా మేడ్చోల్ల కుర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా బోదాసు శంకర్, సంయుక్త కార్యదర్శులుగా జెనిగ వెంకటేశ్, పద్మ శేఖర్, కమిటీ సభ్యులుగా చిత్రాల కృష్ణగౌడ్, కుక్కల శివుడు, బర్మల ధర్మరావు, బోదాసు వెంకటేశ్.

15వ డివిజన్ కమిటీ సభ్యులు..

అధ్యక్షుడిగా ఇంద్రాకంటి అంజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గుబ్బల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా ఇంద్రాకంటి మధుగౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కిరణ్‌గౌడ్, సుభాషిణి, పల్లయ్య, బొండాడ శ్రీనివాస్, బాలయ్య, జనాల కృష్ణ, సాయిరాజ్, ఇంద్రాకంటి శ్రీనివాస్‌గౌడ్, రాధికమ్మ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మోతీనగర్: డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ రోడ్డు నంబర్ 8 నుంచి 11 వరకు సుమారు రూ. 30 లక్షల వ్యయంతో తలపెట్టిన సీసీ రోడ్డు పనులను అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెవ్వురు మధుసూదన్‌రావు, కన్వీనర్ రోణంకి జగన్నాథం, చైర్మన్ తుంగం శ్రీనివాసరావు, కోశాధికారి గుత్తికొండ రామకృష్ణ, ముఖ్య సలహాదారులు చిలకల సాయన్న, సుందర శేషరావు, ఈదరాడ సత్యనారాయణ, పిల్లి అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం

కూకట్‌పల్లి: ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ అధ్యక్షతన కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో ఆదివారం ముఖ్య నేతల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జాతీయ నాయకుడు, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థాగత నిర్మాణానికి పని విభజన చేసుకుని మందకృష్ణ మాదిగ ఆదేశాలు అమలు చేయాలన్నారు. జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జాతీయ నాయకులు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశపాగ రాంచందర్ మాదిగ, సీనియర్ నాయకులు డోలక్ నర్సింగ్‌రావు, విద్యార్థి నాయకుడు పవన్, దుర్గరాజు, మోహన్, రమేశ్, బాలాకృష్ణ, రమేశ, మోహిద్, లక్ష్మణ్, సుదర్శన్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మోతీనగర్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ మరింత సులభం అవుతుందని అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి పేర్కొన్నారు. వివేకానందనగర్ కమ్యూనిటీ హాల్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మధుసూదనారావు, కన్వీనర్ రోణంకి జగన్నాథం, కోశాధికారి గుత్తికొండ రామకృష్ణ, ముఖ్య సలహాదారులు ఈదరాడ సత్యనారాయణ, పిల్లి అశోక్, సీమ షణ్ముకారావు, సుందర శేషారావు, చిలకల సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో 56 లబ్ధిదారులకు రూ.21,60,500 విలువైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. గాజులరామారం డివిజన్‌కు చెందిన 9 మందికి రూ.4.30 లక్షలు, రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన 11 మందికి రూ.4.51 లక్షలు, చింతల్ డివిజన్‌కు చెందిన 8 మందికి రూ.2.89 లక్షలు, కుత్బుల్లాపూర్ డివిజన్‌కు చెందిన 6 మందికి రూ.1.60 లక్షల చెక్కులు, జీడిమెట్ల డివిజన్‌కు చెందిన 5 మందికి రూ.1.67 లక్షలు, అదేవిధంగా నిజాంపేట కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ.6.62 లక్షల చొప్పున పరిహారం మంజూరైందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు, కార్పొరేటర్లు తదతరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో మెరుగైన వైద్యం

సీఎం రిలీఫ్ ఫండ్ పథకంలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన వేముల సాయికుమార్‌రెడ్డి (రూ.60 వేలు) కర్ణాక మణి (రూ.34 వేలు), లలిత భాటి(రూ.44వేలు), సుభాద్ర (రూ.60 వేలు), ముత్యాపాగ కవిత (రూ.40వేలు) విలువైన చెక్కులను గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



కల్యాణంలో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అనంతరం జరిగిన కల్యాణోత్సవంలో బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వైష్ణవి ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగు వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రాకేశ్ కుమార్, కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసే చేరికలు



హన్మంతరెడ్డి సమక్షంలో చేరుతున్న కైసర్‌నగర్ వాసులు

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కైసర్‌నగర్‌కు చెందిన శేఖర్, రాజు ఆధ్వర్యంలో పలువురు ఆదివారం పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడినవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, బోయిని వెంకటేశ్, మాజీ వార్డు మెంబర్ శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షుడు ఎండీ. లాయక్, గణేశ్ తదితరులు ఉన్నారు.

పలు కార్యక్రమాల్లో హన్మంత్‌రెడ్డి..

- జీడిమెట్ల డివిజన్ ఉడ్స్ ఎన్‌క్లేవ్ పార్కులో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.
- వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కల్యాణం, బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.
- లక్ష్మీగంగా ఎన్‌క్లేవ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెల్ఫేర్ సమావేశంలో పాల్గొన్నారు. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు బేకు శ్రీనివాస్, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాయుసేన వీరుడికి సన్మానం

కూకట్‌పల్లి: 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొని బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడలోని స్వగృహానికి చేరిన సార్జెంట్ రాపోలు సుఖదేవ్ శరణ్‌ను, కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, ఏఎంసీ పుష్పారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్మికులు, కూలీలకు బీమా సౌకర్యం కల్పిస్తా



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని భవన, ఇతర కార్మికులు, రోజువారీ కూలీలలకు బీమా కార్డులు అందిస్తామని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు , రోజు వారీ కూలీలతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అందుకే సొంత నిధులతో బీమా సౌకర్యం కల్పిస్తానని సంబంధిత లిస్టును తయారు చేసి ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. ఈ విషయం తెలుసుకున్న క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు కూడా సమావేశానికి హాజరై తమకు కూడా ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పించాలని కోరగా సానుకూలంగా స్పందించడంతో క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు గోపాల్ నాయక్, వెంకటేశ్, రవి, రాములు, గోపాల్, రాజునాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై వేటు..!



నందానగర్‌లో పరిశ్రమ యాజమాన్యం షెడ్డు కోసం చెట్టును తొలగించిన దృశ్యం



షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో..

రంగారెడ్డినగర్: వాయు కాలుష్యాన్ని అరికట్టి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నగరవ్యాప్తంగా ఓ వైపు అధికారులు మొక్కలు నాటుతుంటే మరోపక్క కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను పెకలిస్తున్నారు. భవనానికి అడ్డుగా ఉందని, షెడ్డు వేసేందుకు చెట్లను నరికివేస్తున్నారు. ఏదైనా ప్రాంతంలో చెట్లను తొలగించే ముందు జీహెచ్ఎంసీ అధికారుల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ ఇవేమి లేకుండానే భారీ వృక్షాలు తొలగిస్తున్నా అధికారులు చోద్యం చూడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029